క్లుప్తంగా

తెలుగు భాషాభివృద్ధికి దొనప్ప విశేష కృషి


తెలుగు దిగ్దర్శనం పుస్తకం ఆవిష్కరణ సభలో వక్తలు

యానాం: తెలుగు విశ్వవిద్యాలయం తొలి కులపతి తూమాటి దొనప్ప శత జయంతి ప్రారంభం సందర్భంగా విశిష్ట శతజయంతి స్మృత్యంకితం సభ బుధవారం స్థానిక రీజెన్సీ అతిథి గృహంలో కవి దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఎన్టీఆర్ మానసపుత్రిక అయిన తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్‌చాన్సలర్ తూమాటి దొనప్ప గొప్ప పండితులని, విశ్వవిద్యాలయ పురోగతికి బాటలు వేసారని తెలిపారు. రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎస్ నాయుడు విశిష్ట తెలుగు దిగ్దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. యానాం చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈలప్రోలు విష్ణువర్ధనరావు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి దొనప్ప కృషిని తెలుపుతూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భాషాభిమానులు, పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

జిప్‌మెర్‌లో స్పెషలిస్ట్ వైద్యులకు ఇంటర్వ్యూలు

యానాం: జిప్‌మెర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ విభాగాల స్పెషలిస్ట్ వైద్యులను కన్సాలిడేటెట్ ప్రాతిపదికన నియామకం కోసం ఈనెల 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు బుధవారం చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆనంద్‌రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనస్తీషియా-2, కార్డియాలజీ-1, జనరల్ మెడిసిన్-1, జనరల్ సర్జరీ-1, ఓబీజీ-1, రేడియో రోగ నిర్ధారణ-1, నెఫ్రాలజీ-1 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. సంబంధిత స్పెషాలిటీలో డిగ్రీ, మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. నెలకు రూ.1.24 లక్షల కన్సాలిడేటెడ్ పే ఉంటుందన్నారు. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 10 పోస్టులకు జనరల్-2, ఓబీసీ-4, ఎస్టీ-2 ఖాళీలు ఉన్నాయని ఎంబీబీఎస్‌తో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలని ఎంపికైనవారికి నెలకు రూ.1.03 లక్షల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు 4న ఉదయం 9 గంటలకు జిప్‌మెర్ ఆసుపత్రిలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని అరికట్టాలి

ఉప్పలగుప్తం: మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. విలసవిల్లిలో మొక్కలను నాటే కార్యక్రమానికి బుధవారం ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందితో కలసి గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పంచాయతీ కార్యదర్శి డి.శివప్రసాద్, వీఆర్‌వో కె.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట క్లబ్‌లపై చర్యలు తీసుకోవాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో యథేచ్ఛగా కొనసాగుతున్న పేకాట క్లబ్‌లపై చర్యలు తీసుకోవాలని బుధవారం స్థానికులు పలువురు డిమాండ్ చేశారు. రాజీవ్ బీచ్ వద్ద ఉన్న ఫెర్రీ స్పాట్ ప్రదేశంలో అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జాము వరకు పేకాట క్లబ్ నడుస్తోందని పలు వాహనాలు ఆ ప్రాంతంలో ఉంటున్నాయని స్థానికులు ఆరోపించారు. పరిసర నివాసితులకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బీచ్ ప్రాంతం పరిధిలో మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా పలు లాడ్జిలు ఏర్పాటు చేశారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం


గాడిమొగలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు: గాడిమొగ గ్రామ పంచాయతీలో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎస్ఆర్ నిధులు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వనమాడి వేణి, నాయకులు టి.లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, కామాడి మాతరాజు, వనమాడి నూకరాజు, ధూళిపూడి బాబి, పంచాయతీ కార్యదర్శి జేవీ రమణమ్మ పాల్గొన్నారు. జార్జీపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్ పాఠశాలలో స్థానిక నాయకుడు మందపల్లి దుర్గ, రాంబాబు ఆర్థిక సహాయంతో 45 మంది విద్యార్థులకు పుస్తకాల కిట్లను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం శరత్, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం

- ఇందుపల్లిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ జిల్లా సభ విజయవంతం
- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

అమలాపురం టౌన్ /అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం మోసాలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎండగట్టారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి ఎ-కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ సభకు పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ప్రసంగం జిల్లా పార్టీ కార్యకర్తలను ఆకట్టుకుంది. ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, కార్యకర్తల్లో సభ కొత్త ఉత్తేజాన్ని నింపింది. సభాప్రాంగణం కార్యకర్తలతో కిక్కిరిసిపోవడంతో పాటు హాలు సరిపోక వెలుపలి నుంచి కూడా వేలాది మంది కార్యకర్తలు నేతల ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. అమలాపురం ఈదరపల్లి వంతెన నుంచి ఇందుపల్లి ఫంక్షన్ హాలుకు వచ్చే రహదారి ట్రాఫిక్‌తో కిక్కిరిసింది.

సభకు అడ్డంకులు

సబ్ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా సభను అడ్డుకోవాలని పోలీసులు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేసినా పార్టీ నాయకులు, కార్యకర్తలు వాటిని ఖాతరు చేయకుండా స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పార్టీ పట్టణ, అల్లవరం, ఉప్పలగుప్తం, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల అధ్యక్షులు సంసాని బుల్లినాని, గుత్తుల చిరంజీవిరావు, బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, విత్తనాల శేఖర్, ముత్తాబత్తుల ఆనంద్, ఎంపీపీలు కుడిపూడి భాగ్యలక్ష్మి, యిళ్ల శేషారావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి,మున్సిపల్ చైర్మన్ పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, జిల్లా కార్యదర్శులు సరేళ్ల రా కముజు రమణ, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కుడుపూడి వెంకటేశ్వరబాబు, యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, కేతా భాను తేజ పాల్గొన్నారు.


సభా వేదికపై మాజీ ముఖ్యమంత్రి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బొత్స సత్యనారాయణ, జగ్గిరెడ్డి తదితరులు

బొత్సకు ఘన సత్కారం

సభ ముగిసిన తర్వాత బొత్స సత్యనారాయణ స్థానిక భట్నవిల్లిలోని మాజీ మంత్రి విశ్వరూప్ క్యాంపు కార్యాలయానికి వచ్చారు. మాజీ మంత్రి విశ్వరూప్, అమలాపురం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ గజమాలతో బొత్సను ఘన సత్కరించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్, రామచంద్రపురం కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇందుపల్లి ఫంక్షన్ హాలు వద్ద జిల్లా పార్టీ శ్రేణులు బెలూన్లతో బొత్స సత్యనారాయణకు ఘన స్వాగతం పలికారు.


సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోసాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చూపిస్తున్న బొత్స సత్యనారాయణ, జగ్గిరెడ్డి


బొత్స సత్యనారాయణను గజమాలతో సత్కరిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలి

రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యులు

అమలాపురం రూరల్: సంక్షేమ హాస్టళ్ల, మధ్యాహ్న భోజన పథకాలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యులు ఈ. లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కృష్ణకిరణ్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వీరు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆహార భద్రత కమిషన్ ప్రధానంగా ఆహార భద్రతా ప్రమాణాలు, పోషకాహార పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తుందన్నారు. రేషన్ షాపులు, స్కూళ్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర చోట్ల ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేస్తుందన్నారు. ఆహారాన్ని నిల్వ చేయడం, వంటశాలలు, స్టోర్‌రూమ్‌ల పరిశుభ్రతనూ పరిశీలిస్తుందన్నారు. ఆయా తనిఖీల్లో లోపాలు గుర్తిస్తే, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తుందన్నారు. అవసరమైతే బాధ్యులపై చర్యలకు సిఫార్సులు చేస్తుందన్నారు. ఈ కమిషన్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలున్నాయని, లోపాలు గుర్తించినప్పుడు పూర్తి స్థాయిలో విచారణ చేస్తారని తెలిపారు. అనంతరం పలు వసతి గృహాలను తనిఖీ చేశారు. జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, సీడీపీవోలు, సోషల్, బీసీ వెల్ఫేర్, తూనికలు-కొలతలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి, కృష్ణకిరణ్

యూజీ నాన్ నీట్ డ్రాఫ్ట్‌మెరిట్ జాబితా విడుదల

యానాం: యూజీ నాన్‌నీట్ కోర్సులైన బీఎస్సీ అగ్రికల్చర్, హార్టీకల్చర్, ఫార్మ్ డి, బీఫార్మసీ, బీపీటీ, బీఎస్సీ, పారామెడికల్ డిగ్రీ కోర్సులు, డీఏఎస్ఎమ్ తదితర కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కోర్సుల్లో ప్రవేశానికి డ్రాఫ్ట్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు బుధవారం సెంటాక్ కోఆర్డినేటర్ అమన్‌శర్మ తెలిపారు. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన తర్వాత సెంటాక్ వెబ్‌సైట్‌లో ప్రచురించినట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్ల కోసం నిర్వహించిన పి.నెట్-2025 ఎంట్రన్స్ ఆధారంగా ఫలితాలను ప్రకటించిన అనంతరం మెరిట్ జాబితా విడుదల చేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

ఐ.పోలవరం: నూతనంగా నిర్మించనున్న 11 కేవీ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం శుక్రవారం ఐ.పోలవరం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు ఈ నెల 4న అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, ఎర్రగరువు, జి.మూలపాలెం, కేసనకుర్రు, కేసనకుర్రు పాలెం, తిలకుప్ప గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్

ఐ.పోలవరం: ప్రైవేట్ పాఠశాలల సంఘాల ఆదేశాల మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నట్టు ఐ పోలవరం మండలం ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు బుధవారం బంద్ నోటీసును మండలం విద్యాశాఖ అధికారికి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల సంఘాల ఆదేశాల మేరకు 3వ తేదీన బంద్ పాటిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల సజావుగా పనిచేయడానికి ఆటంకం కలిగించే వివిధ నియమాలు, నిబంధనలను ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేయడమే ఈ పిలుపుకు కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామేశ్వరపు శేషగిరి,సలాది శ్రీనివాసరావు, శీలం ప్రకాష్, విత్తనాల నాగేశ్వరరావు, సిహెచ్. చక్రపాణి, వనచర్ల శ్రీనివాసరావు,స్టాలిన్, ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

యానాం: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటీవలి ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో పలు స్కూళ్లలోని విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంలో విశేష కృషిచేసిన ఉపాధ్యాయులను అభినందించారు. త్వరలో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకం అమలు కానుందని తెలిపారు. ఇప్పటికే విద్యార్థినులకు సైకిళ్లను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అనంతరం పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. గిరియాంపేట హైస్కూల్, దరియాలతిప్ప, పరంపేట హైస్కూల్స్‌తో పాటు ఎంజీజీబీహెచ్ స్కూల్లో పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

రేషన్ బియ్యం తరుగుపై లబ్ధిదారుల ఆవేదన

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రేషన్ దుకాణంలో బియ్యం తరుగు రావడంపై పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేసారు. 20 కిలోలకు అరకిలోపైగా తక్కువ వచ్చిందని, 40 కిలోలకు సుమారు కిలోన్నర పైగా బియ్యం తక్కువ వస్తున్నట్లు కార్డుదారులు ఆరోపించారు. రేషన్ దుకాణంలో తీసుకున్న 40 కిలోల బియ్యాన్ని బయట కిరాణా షాపులో తూకం వేయగా 38.430 గ్రాములు ఉన్నాయని సుమారు కిలోన్నరపైగా తక్కువ వచ్చాయన్నారు. దీనిపై డీలర్‌ను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని బాధితుడు రెడ్డి ప్రసాద్ కోరాడు.


40 కిలోల రేషన్ బియ్యాన్ని తూకం వేయగా 38.430 గ్రాములు వచ్చిన వైనం

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పంటల సాగుకు ఏర్పాట్లు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకార లోపం నివారణకు దోహదం
- స్థలాల కొరతతో ముందుకు సాగని కిచెన్ గార్డెన్ విధానం
- అధికారుల నిర్లక్ష్యం, ఆసక్తి చూపని కార్యకర్తలు, ఆయాలు

అల్లవరం: బాలింతలు, గర్భిణులు, ఆరేళ్లలోపు పిల్లలకు పోషకాలతో కూడిన సమతుల ఆహారాన్ని నిరంతరాయంగా అందించి, ఆరోగ్యవంతమైన పల్లెలను భావి తరాలకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. కిచెన్ గార్డెన్ పథకం ప్రవేశపెట్టి ఐదు నెలలైనా నేటికీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటులో జాప్యం జరగడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని తల్లులు, పిల్లలకు పౌష్టికాహార లోపం కనిపిస్తోంది.

ఆచరణలో నిర్లక్ష్యం

అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, పంట సంరక్షణ, నారు వేయడం తదితర బాధ్యతలు గ్రామ సంఘాల పరిధిలోని వీఓఏలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సెంటు, లేదా సెంటున్నర స్థలంలో ఆకుకూరలు, కూరగాయలు, దానిమ్మ, జామ, ఉసిరి బొప్పాయి వంటి పండ్ల వృక్షాల పెంపకాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టారు. ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు రూ. 10 వేలు చొప్పున గ్రామ సంఘాల ఖాతాలకు నిధులిచ్చి బాధ్యతలు అప్పగించారు. ఎంపిక చేసిన స్థలంలో ఒక యూనిట్ మట్టిని వేసి దాని చుట్టూ గ్రీన్ మెస్ ఏర్పాటుచేసి, అందులో ఆరు రకాల విత్తనాల వేయాల్సి ఉంది. కిచెన్ గార్డెన్ నిర్వహణకు కావల్సిన పరికరాల సహాయంతో ఆకుకూరలు, కూరగాయలను పండించి, వాటిని బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఆహారంలో అందిస్తూ, మిగిలిన ఆకుకూరలు, కూరగాయలతో ప్రీ స్కూల్ పిల్లలకు భోజనాలు వండి పెట్టాలి. ఇవేమీ గత ఐదు నెలలుగా ఆచరణలో లేదు. కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు అవసరమైన నిధులను పుష్కలంగా ఉన్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు.

కిచెన్ గార్డెన్‌లో పెరుగుతున్న తుప్పలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌కు స్థలం కొరత, వీఓఏలు నిర్వహణ లోపం క్షేత్రస్థాయిలో దర్శనమిస్తోంది. గ్రామ సంఘాల్లో నిధులు మూలుగుతున్నా కిచెన్ గార్డెన్ పంటపై గ్రామ సంఘాలు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అధికారులు పట్టించుకోవడం లేదు. అమలాపురం నియోజకవర్గ పరిధిలో 42 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. అల్లవరంలో 24, ఉప్పలగుప్తంలో 07, అమలాపురం రూరల్ పరిధిలో 11 కిచెన్ గార్డెన్‌లకు రూ. 10 వేలు చొప్పున రూ.4.20 లక్షల నిధులను కేటాయించారు. ఐదు నెలలుగా కేవలం సగం మాత్రమే కిచెన్ గార్డెన్ పంట వేయగా నిర్వహణ లోపంతో కలుపు మొక్కలు, తుప్పలు పెరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నేటికి కిచెన్ గార్డెన్ ఊసేలేదు. ఇప్పటికైనా ఐసీడీఎస్ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లోని తల్లులు, పిల్లలకు సమతుల్య ఆహారాన్ని అందించేందుకు కిచెన్ గార్డెన్ పంటపై దృష్టి సారించాలని తల్లులు కోరుతున్నారు.


పేరూరులోని మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్‌లో పెరిగిన తుప్పలు


దేవగుప్తంలో అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్‌లో విత్తనాలు చల్లుతున్న అంగన్‌వాడీ సిబ్బంది


మొగళ్లమూరులోని కిచెన్ గార్డెన్‌లో పెరిగిన ఆకుకూరలు

42 కేంద్రాల్లో కిచెన్ గార్డెన్

అమలాపురం నియోజవర్గ పరిధిలో 42 కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు నిధులు విడుదల చేశారు. ఐదు నెలలు కావస్తున్నా నేటికీ ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు. కొన్ని ఏరియాల్లో మాత్రం ఇప్పుడిప్పుడే ప్రారంభించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల వృక్షాలు పెంచేందుకు కిచెన్ గార్డెన్ విధానం ఏర్పాటు చేశారు.

వై.రమాదేవి, సీడీపీఓ, అమలాపురం

స్థలాల కొరతతో ఇబ్బంది

అల్లవరం మండలంలో 24 కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు నిధులు విడుదల చేశారు. 14 కేంద్రాల్లో వీఓఏలు, ప్రకృతి వ్యవసాయ వలంటీర్లు ఇప్పటికే నారు పోసి, వాటి నిర్వహణ చేపట్టారు. స్థలాల కొరత కారణంగా 7 కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయలేదు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లతో మాట్లాడి త్వరలో ఏర్పాటు చేస్తాం.

సయ్యద్, ఏపీఎం, అల్లవరం

డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాశ్ బాధ్యతల స్వీకరణ


తాళ్లరేవు మండల డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాశ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న పంచాయతీ కార్యదర్శులు

తాళ్లరేవు: మండల డిప్యూటీ ఎంపీడీఓగా సీహెచ్ ఎం ప్రకాశ్ నియమితులయ్యారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్‌ను పంచాయతీ కార్యదర్శులు వీజేవీ రమణ, ఎస్‌వీ రమణ, ఎస్.శంకరనారాయణ, ఎం.ప్రసాద్, పి.శ్రీనివాస్ గ్రేడ్-5 కార్యదర్శులు, మండల కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ జేఏబీసీలు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

వర్షం నీటిలో విద్యార్థుల అవస్థలు


గాడిమొగ పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారిలేక విద్యార్థుల అవస్థలు

తాళ్లరేవు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పాఠశాల ప్రాంగణంలో నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. తాళ్లరేవు మండల పరిధిలోని గాడిమొగ పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారిలేకపోవడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. గత ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసారు. ప్రస్తుతం కనీస నిర్వహణ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా మహాలక్ష్మమ్మ జాతర

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పెదవలసలలో కొలువై ఉన్న మహాలక్ష్మి అమ్మవారి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. గ్రామ పరిసర ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో లంకే నూకరాజు, బొడ్డు శ్రీను, పేర్రాజు, ధర్మారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలపై అవినీతి కేసు నమోదు

యానాం: పుదుచ్చేరి పోలీస్‌శాఖలో ఒక మహిళా సబ్‌ఇన్‌స్పెక్టర్, అదే హోదాలో ఉన్న ఆమె భర్తపై బుధవారం కేసు నమోదైంది. విలియనూర్ పోలీస్ స్టేషన్‌లో కొన్ని వారాల క్రితం దాఖలైన బాలిక తప్పిపోయిన ఫిర్యాదుకు సంబంధించి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై స్థానిక పోలీసులు విజిలెన్స్, అవినీతి నిరోధకశాఖ విభాగం ఎస్సైలపై కేసు నమోదు చేసింది. విలియనూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సైలు శరణ్య, ప్రభుపై కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీ కనిపెట్టడానికి ప్రయాణ సంబంధిత ఖర్చుల కోసం ఎస్సై శరణ్య రూ.5వేలు డిమాండ్ చేసిందని పేర్కొన్నారు. క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి ఇద్దరు ఎస్సైలపై నమోదైన అభియోగాలను వివరిస్తూ పోలీసు ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపారు.

డెంగీపై అవగాహన ర్యాలీ


డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఐ.పోలవరం: జాతీయ డెంగీ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా తిల్లకుప్ప పంచాయతీలో ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ప్రాణాంతక వ్యాధులను వ్యాపింపజేసే దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. స్థానిక సర్పంచ్ కె. తమ్మయ్య, సెక్రటరీ ఆర్. స్వాంబాబు, సబ్ యూనిట్ అధికారి పీఎస్వీ రాజ్‌కుమార్, ఎంపీహెచ్ఓ ఎం.వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కే రమేష్, హెల్త్ అసిస్టెంట్ కే లోవరాజు గణేష్ గౌడ్, ఎంఎల్‌హెచ్‌పీ పి.సాయి వినూత్న, ఏఎన్ఎం వై.గంగాభవాని, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.లక్ష్మీస్నేహలత, డి.సాయికిషోర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.